క్లుప్తంగా

సమయపాలన పాటించని సిబ్బంది.. గ్రామస్తుల ఇబ్బంది



సిబ్బంది కోసం ఎదురుచూస్తున్న గ్రామస్తులు

సీలేరు: సకాలంలో ప్రజలకు సేవలు అందించవలసిన సచివాలయం సిబ్బంది సమయ పాలన లేకుండా విధులకు హాజరవుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీలేరు సచివాలయం సోమవారం ఆలస్యంగా విధులకు హాజరయ్యారు. దీంతో పలువురు ఇబ్బందులు పడ్డారు. ఉదయం 10 గంటలకి హాజరవ్వాల్సిన సిబ్బంది 11:30 వరకు ఏ ఒక్క శాఖకు చెందిన ఉద్యోగి ఎవరు సచివాలయానికి రాలేదు. వివిధ పనుల కోసం వచ్చిన గ్రామస్తులు సిబ్బంది కోసం ఎదురుచూస్తూ చాలాసేపు ఉన్నారు. ఇలా తరచూ జరుగుతుందని పలువురు ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకట్రావు చెప్పారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

సీలేరు: సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర హోమియో డాక్టర్ బి.సృజనరాయ్ హెల్త్ సూపర్ వైజర్ ఎస్.త్రినాథ్ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. దుప్పులవాడ గోరిలోవ గ్రామంలో ఈకార్యక్రమం ఈనెల 19న నిర్వహించనున్నట్టు చెప్పారు. మహిళలకు ప్రత్యేకించి స్క్రీనింగ్ చేయించుకోవాలన్నారు. స్త్రీలకు రక్తపోటు పరీక్షించడం, మధుమేహం పరీక్ష, నోటి క్యాన్సర్ పరీక్షించడం, రొమ్ము క్యాన్సర్ పరీక్షించడం, గర్భాశయ క్యాన్సర్ పరీక్షించడం, క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు, పోషణ అభియాన్ గురించి ఈట్ రైట్ సరైన పోషణ ఆహారం తీసుకోవడం కోసం కిషోర్ కార్యక్రమం ద్వారా మహిళలు కార్యక్రమం ద్వారా మహిళలు ఆరోగ్యంగా ఉండాలని , ఆస్పత్రిలో సోమవారం కార్యక్రమాన్ని నిర్వహించారు.

రాకపోకలకు అగచాట్లు



వాగు వద్ద సరుకులు దించేసి మోస్తున్న ఉబ్బెంగుల గిరిజనులు

ముంచంగిపుట్టు: లక్ష్మీపురం పంచాయతీ ఉబ్బెంగుల వా గుపై వంతెన నిర్మించాలని గ్రామ గిరిజనులు కోరుతున్నారు. సోమవారం వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గ్రామ గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాగులో నుంచి మోసుకొని వెళ్లారు. వర్షాకాలంలో రాకపోకలకు నరకయాతన అనుభవిస్తున్నామని, పక్క రహదారి, వాగుపై వంతెన నిర్మిస్తే ఉబ్బెంగుల, దొరగూడ గ్రామాలకు రవాణా కష్టాలు తీరుతాయని గ్రామస్తులు నిరీక్షణ,సుబ్బరావు,లక్ష్మణ్,లైకోన్‌లు కోరారు.

ఉచితంగా యూరియా పంపిణీ చేయాలి

అరకులోయటౌన్: జిల్లాలోని గిరిరైతులందరికీ ఉచితంగా యూరియా పంపిణీ చేయాలని కోరుతూ సోమవారం కిసాన్ కాంగ్రెస్ జిల్లా చైర్మన్ పాంగి గంగాధర్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యలయం ఎదుట నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ యూరియా కొరతతో గిరిరైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బ్లాక్ మార్కెట్‌లో యూరియా విక్రయిస్తున్నా, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. నాయకులు సాయిబాబా, సోమేష్, పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతు పనులు



రామాలయంలో పైపులైన్ మరమ్మతు చేస్తున్న స్థానికులు

చింతపల్లి; రామాలయం వీధిలో తాగునీటి సరఫరా పైపులైన్‌కు మరమత్తులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. గడిచిన వారం రోజులుగా తాగునీరు సరఫరా చేసే పైపులైన్లు దెబ్బతినడంతో నీరంతా వృథాగా పోతుందని, తాగునీటికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులకు స్థానికులు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో చేసేది లేక సోమవారం స్థానికులు శ్రమదానం చేసి పైపులైనుకు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. ఇప్పటికై నా ఉన్నతాధికారులు స్పందించి పైపులైనుకు పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



బాలారం- చోద్యం రహదారి దుస్థితి



అధ్వానంగా గింజర్తి-బొర్రంపేట రహదారి

దారులు ఇలా... ప్రయాణమెలా?



ఒంబి గ్రామ రహదారిలో కోతకు గురైన కల్వర్టు



చిత్తడిగా మారిన ఒంబి రహదారి

- అధ్వానంగా 30 గ్రామాల రహదారి
- కోతకు గురైన రాళ్లు తేలిన దారి
- వాహనచోదకుల అవస్థలు

కొయ్యూరు: మండలంలోని చాలా గ్రామాల్లో రహదారులు దారుణంగా ఉన్నాయి. రాళ్లు తేలి,పెద్ద పెద్ద గోతులతో దర్శనమిస్తున్నాయి. ఇందులో భాగంగా మండలంలోని చింతలపూడి, గింజర్తి మీదుగా కొమ్మిక, కంతారం, బాలారం, బకులూరు. ఆడాకుల, ఆర్.కొత్తూరు పంచాయతీల్లో 30 గ్రామాల ప్రజలు 15 ఏళ్ల క్రితం నిర్మించిన దెబ్బ తిన్న రహదారిపైనే రాకపోకలు సాగిస్తున్నారు. ఈ రహదారి కోతకు గురై పెద్ద పెద్ద గోతులతో ఉంది. రాళ్లు తేలిన రహదారిపై ప్రయాణానికి వాహనచోదకులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ 'రహదారి ఏర్పాటుకాక ముందు అంతా కృష్ణాదేవిపేట నుంచి చోద్యం గ్రామం మీదుగా వెళ్లేవారు. దీని మూలంగా అదనంగా 20 కిలోమీటర్ల దూరం తిరిగి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు తక్కువ దూరంలో వెళ్లేందుకు అవకాశం ఉన్నా రోడ్డు దారుణంగా ఉందని, రహదారికి మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అసంపూర్తిగా పనులు

దుంబ్రిగుడ: మండలంలోని కంద్రుమ్ పంచాయతీ జాంకరుగూడా బీటీ రోడ్డు నుంచి ఒంబి గ్రామానికి వెళ్లే గ్రావెల్ రోడ్డు అసంపూర్తిగా దర్శనమిస్తుంది. ఈ రోడ్డు నిర్మాణానికి నిధులను ప్రభుత్వ అధికారులు మంజూరు చేశారు. పనులు ప్రారంభమైన కొద్ది రోజులకే నిలిపివేశారు. మట్టి మాత్రమే పోసి వదిలేయడంతో గిరిజనులు బురద మయంగా ఉన్న ఈ రోడ్డులో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. చినుకు పడితే చిత్తడిగా మారుతుందని, జారిపడి వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారపు సంతకు వివిధ రకాల అటవీ ధినుసులు తీసుకెళ్లేందుకు నానా ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధ్వాన రహదారి సమస్యను పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదంటున్నారు. సమస్యను కలెక్టర్ దినేష్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్తామని ఆ గ్రామస్తులు సంగీతాసు బాబు తో పాటు మండల వైస్ ఎంపీపీ శెట్టి ఆనంద్, సర్పంచ్ కె.హరి చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

వెంటనే చర్యలు చేపట్టాలి

గింజర్తి దాటిన తర్వాత కొండ వద్ద రహదారి పూర్తిగా పాడైంది. దీని మూలంగా ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పంచాయతీ రాజ్ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– రాజారావు, బొర్రంపేట

ప్రతిపాదనలు పంపాం

చోద్యం నుంచి చింతలపూడి వరకు 21 కిలోమీటర్ల మేరకు రహదారి కోసం ప్రతిపాదించాము. ఇందులో భాగంగా ప్రస్తుతం ఇబ్బందులు పడుతున్న రహదారి కూడా ఉంది. నిధులు విడుదలైన వెంటనే పనులు చేపడతాము. పూర్తిగా పాడైన చోట సీసీ వేయాల్సి ఉంది.

– రామకృష్ణ, జేఈ,పీఆర్

గోమంగిని మండల కేంద్రంగా ప్రకటించాలని వినతి



అరకు ఎమ్మెల్యే మత్స్యలింగంనకు వినతపత్రం అందజేస్తున్న గోమంగి మండల సాధన సమితి ప్రతినిధులు

అరకులోయటౌన్/పెదబయలు: అరకులోయ నియోజకవర్గం పరిధిలోని పెదబయలు మండలం గోమంగిలో మండలం ఏర్పాటు చేయాలని కోరుతూ గోమంగి మండల సాధన సమితి అధ్యక్షుడు సల్లంగి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు గ్రామస్తులు సోమవారం అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గోమంగి సాధన సమితి అ . ధ్యక్షుడు సల్లంగి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గోమంగి మండల కేంద్రం ఏర్పడితే 17 గ్రామ పంచాయతీల పరిధిలోని గిరిజనులకు విద్య, వైద్యంతో పాటు మారుమూల ప్రాంతాల అభివృద్ధి సాధ్యమౌతుందన్నారు. గోమంగి మండల కేంద్రం ఏర్పాటుకు కృషి చేయాలని వారు కోరుతూ ఎమ్మెల్యే మత్స్యలింగనకు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ విషయాన్ని ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. పెదబయలు జెడ్పీటీసీ సభ్యుడు కూడ బొంజుబాబు, మాజీ ఎంపీపీ జర్సింగి సూర్యనారాయణ, కమిటీ సభ్యులు అనంత పద్మనాభం, రాధాకృష్ణ, నాగరాజు, కొండబాబు, లక్ష్మీనారాయణ, సూరయ్య, జామిగుడ సర్పంచ్ వెంకటరావు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం



సచివాలయ సిబ్బందిని సన్మానిస్తున్న స్థానికులు

గూడెంకొత్తవీధి: దేవరాపల్లి సచివాలయం నుంచి బదిలీ అయిన సిబ్బందికి సోమవారం స్థానికులు ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. సర్పంచ్ బుజ్జిబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో భారత ఆదివాసీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొట్టడం రాజుబాబు పాల్గొని మాట్లాడారు. మాజీ జెడ్పీటీసీ మత్స్యరాజు, ఎంపీటీసీ కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ బాబూరావు, పీసా కమిటీ సభ్యులు రామలింగం, బాబురావు మాట్లాడారు. కార్యదర్శి స్వామినాయుడు, ఏఈ గణపతి, సన్మాన గ్రహీతలు జాన్‌బాబు, మహేశ్వరి, రాంబాబు పాల్గొన్నారు.

పశువ్యాధులపై అప్రమత్తం



తీగలవలసలో పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది



బంధవీధిలో పశువులకు వైద్యసేలందిస్తున్న సిబ్బంది



మామిడిపల్లి గ్రామంలో పశువులకు టీకాలు వేస్తున్న, సిబ్బంది

దుంబ్రిగుడ/హుకుంపేట/జి.మాడుగుల/ చింతపల్లి/గూడెం కొత్తవీధి/సీలేరు/ రాజవొమ్మంగి/ వై.రామవరం/కూనవరం:

జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పశువులకు వ్యాక్సినేషన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారులు మాట్లాడుతూ పశువులకు మూతిపుండ్లు, డెక్క పుండ్లు రాకుండా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. గాలికుంటు వ్యాధి వలన పశువులు మేత మేయలేవని, అనారోగ్యం బారిన పడతాయన్నారు. టీకాలు వేయించడం వలన పాడి పశువుల్లో వ్యాధిని నిరోధించవచ్చన్నారు. ప్రతి గ్రామంలో వచ్చే నెల 15వ తేదీ వరకు పశువైద్య శిబిరాలు ఏర్పాటుచేసిన పశువులకు టీకాలు వేయనున్నట్టు చెప్పారు. రైతులు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా శిబిరాల్లో పశువులకు టీకాలు వేశారు. రైతులకు మినరల్ మిక్చర్ తదితర మందులను అందజేశారు. దుంబ్రిగుడలో సర్పంచ్ శారద, పశుసంవర్ధకశాఖ వైద్యాధికారి రాజశ్రీ, హుకుంపేటలో పశువైద్యాధికారి డాక్టర్ చరణ్, జి.మాడుగులలో పశువైద్యాధికారులు డాక్టర్ సృజన కుమారి, డాక్టర్ కుసుమ ప్రియదర్శిని, చింతపల్లిలో పశువైద్యాధికారి డాక్టర్ సౌజన్య, ర్పంచ్ సోమరత్నం, జీకే వీధిలో పశువైద్యాధికారి రమేష్, సర్పంచ్ వంశీకృష్ణ, బుజ్జిబాబు,ఎంపీటీసీ అప్పారావు, సీలేరులో పశు వైద్యాధికారి డాక్టర్ రమేష్, రాజవొమ్మంగిలో పశువైద్యాధికారి డాక్టర్ తరుణ్, వై.రామవరంలో పశువైద్యాధికారి డాక్టర్ యు.వీరేంద్ర, కూనవరంలో పశువైద్యాధికారి మాధవీలత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అమ్మిరేఖలలో పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది



రాచపాలెంలో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి వీరేంద్ర



జీకే వీధిలో అవగాహన కల్పిస్తున్న పశువైద్యులు రమేష్



దుంబ్రిగుడలో పాడి రైతులకు మందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్



పెదార్యూరులో పశువులకు టీకా వేస్తున్న సిబ్బంది



సీలేరులో పశువులకు టీకా వేస్తున్న సిబ్బంది

ఎన్ఆర్ఎస్‌టీ కేంద్రాన్ని పిట్లపాడులో ఏర్పాటు చేయాలి



పిట్లపాడులో చిన్నారులు, గ్రామస్తులతో ఎంఈవో రాంబాబు

కొయ్యూరు: అక్షరాలు నేర్చుకునే వయస్సు కలిగిన 25 మంది పిల్లలున్న సొంత గ్రామంలోనే నాన్ రెసిడెన్షియల్ స్కూల్ టీచర్ సెంటర్ (ఎన్ఆర్ ఎస్‌టీ) కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని బూదరాళ్ల పంచాయతీ పిట్లపాడు గ్రామస్తులు పట్టుపట్టారు. ఎంఈవో ఎల్.రాంబాబు సోమవారం గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు.. పక్కనున్న గరిమండకు పిల్లలను పంపరాదని,కేంద్రాన్ని ఇక్కడే ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. దీనిపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు ఎంఈవో పిట్లపాడును సందర్శించారు. గరిమండకు సమీపంలోని పిట్లపాడు ఉంది. ఇక్కడ గ్రామస్తులు పాఠశాలను ఏర్పాటు చేయాలని గతంలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.అయితే పిట్లపాడులో ఎన్ఆర్ ఎస్‌టీ కేంద్రాన్ని ప్రతిపాదించారు. విద్యాశాఖాధికారులు రెండు గ్రామాల మధ్య దూరం తక్కువ కావడంతో అక్కడ కేంద్రాన్ని కేటాయించలేదు.పిట్లపాడు గ్రామ చిన్నారులు గరిమండ పాఠశాలకు వెళ్లాలని చెప్పారు. .ఈ మేరకు పిట్లపాడు పిల్లలను గరిమండలో చేర్చారు.అక్కడ యు డైస్‌లో పిల్లల పేర్లు నమోదయ్యాయి.పెద్ద గ్రామమైన పిట్లపాడులో పాఠశాల లేకపోవడం దారుణమని, ఎన్ఆర్ ఎస్‌టీ కేంద్రానికి బదులుగా రెగ్యూలర్ పాఠశాలను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. యు డైస్ కోడ్ ఉన్న గరిమండ పాఠశాలలో చదివితేనే పిల్లలకు మధ్యాహ్నం భోజనం వస్తుందని, లేకుంటే రాదని ఎంఈవో సూచించారు.ఆయన మాట్లాడుతూ విషయాన్ని ఉన్నతాదికారుల దృష్టిలో ఉంచి వారి ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం



డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోస్టర్ ఆవిష్కరిస్తున్న విద్యార్థులు

అరకులోయటౌన్: డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యమని అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్ అన్నారు. సోమవారం కళాశాలలో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్ మాట్లాడారు. విద్యార్థులు డ్రగ్స్ జోలికి పోకుండా శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజయవాడలోని ఈగల్ డిపార్ట్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ కె.రాంబాబు మాట్లాడారు. యువత డ్రగ్స్ బారినపడి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. అంతే కాకుండా ప్రభుత్వం విధించే చర్యల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు కలిసి డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలను తెలియజేస్తూ ప్రతిజ్ఞ చేశారు. అధ్యాపకులు, ఈగల్ డిపార్టుమెంట్ టీమ్ విజయ్ కుమార్, మల్లేశ్వరరావు, భాస్కర్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు గిరిజన విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థికి అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ముంచంగిపుట్టు: డిశంబర్ నెలలో కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ముంచంగిపుట్టు మండలం నుంచి ముగ్గురు గిరిజన విద్యార్థులు ఎంపికైయ్యారు. చింతపల్లిలో జరిగిన జిల్లా స్థాయి కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీల్లో ఎల్లో బెల్ట్ సాధించారు. మండలంలోని బొండాపుట్టుకు చెందిన గడుతుల నవీన్‌కుమార్, లుంగాపుట్టుకు చెందిన పెటియా ఆనంద్, సరియాపుట్టుకు చెందిన చంద్రకాంత్‌పడాల్‌లు కరాటే పోటీల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచారు. మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల-2లో సోమవారం అభినందన సభను నిర్వహించారు.రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పాటు పీడి రాంబాబు, కరాటే శిక్షకుడు సురేష్‌లకు హెచ్‌ఎం శంకర్, ఉపాధ్యాయులు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ముంచంగిపుట్టులో మొక్కలు నాటుతున్న సీఆర్‌పీఎఫ్ పోలీసులు

ముంచంగిపుట్టు: సమాజంలో మొక్కలు నాటడం సామాజిక బాధ్యత అని సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శరవణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో సీఆర్‌పీఎఫ్ జి198 బెటాలియన్ కమోండెంట్ శ్రీరామపల్ట్ ఆదేశాల మేరకు స్థానిక డి-198 సీఆర్‌పీఎఫ్ పోలీసులు సుమారు 200 మొక్కలను పలు ప్రదేశాల్లో నాటారు. సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శరవణ్‌కుమార్ మొక్కలు నాటి అనంతరం ఆయన మాట్లాడుతూ పచ్చదనాన్ని పరిరక్షించి పర్యావరణాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కాలుష్యం నుంచి విముక్తి పొందాలంటే పచ్చదనాన్ని పరిరక్షించుకోవాలన్నారు. సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

జేఏసీ నాయకుల వినతి

చింతూరు: ఏజన్సీలో గిరిజనేతరుల వలసలు పెరుగుతున్నందున వారి ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి కొత్త విద్యుత్ మీటర్లకు అనుమతులు ఇవ్వొద్దని ఆదివాసీ జేఏసీ నాయకులు అన్నారు. ఈ మేరకు సోమవారం వారు స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయంలో లైన్ ఇన్‌స్పెక్టర్ కణితి గణేష్‌కు వినతిపత్రం అందజేశారు. జేఏసీ డివిజన్ చైర్మన్ నరేష్ మాట్లాడుతూ 1/70 చట్టాల ప్రకారం ఏజన్సీలో గిరిజనేతరులకు ఎలాంటి హక్కులు ఉండవన్నారు. డివిజన్ కార్యదర్శి సీతారామయ్య, సాయిబాబు, పొడియం రామకృష్ణ, రాముడు, వీరయ్య పాల్గొన్నారు.

యూరియా పంపిణీ

జి.మాడుగుల: గాంధీనగరం గ్రామంలో సోమవారం రైతులకు యూరియా పంపిణీ చేశారు.ఎంపీపీ అప్పలరాజు, ఏవో వరప్రసాదరావు, ఎంపీటీసీలు సన్యాసిదొర, సర్పంచ్‌లు హనుమంతరావు, రాంబాబు, కొండబాబు, వెంకటేష్, కృష్ణమూర్తి, నాయకులు గంతదొర, కొండబాబు తదితరులు పాల్గొన్నారు. సీఐ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.


విద్యుత్ శాఖ ఉద్యోగుల నిరసన

మోతుగూడెం: కార్మికుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం దశల వారి ఆందోళనలో కార్యక్రమాల్లో భాగంగా ఏపీ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు నల్లబ్యాడ్జీలతో ఉద్యోగులు నిరసన తెలిపారు. లోయర్ సీలేరు చీఫ్ ఇంజనీర్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు, నాయకులు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

నేటి నుంచి బైక్ జాత

గంగవరం : ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 16 నుంచి 19వ తేదీ వరకు రంపచోడవరం నియోజకవర్గంలో బైక్‌జాత నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ సోమవారం ప్రకటనలో పిలుపు నిచ్చారు.బైక్‌ర్యాలీ మంగళవారం రాజవొమ్మంగి మండలం చేరుకొని అక్కడ నుంచి అడ్డతీగల చేరుతుందన్నారు. 17న ఉదయం 12 గంటలకు గంగవరం , రంపచోడవరం, దేవిపట్నం మండలానికి ఈ బైక్‌జాత చేరుతుందన్నారు.


సీజనల్ వ్యాధులపై అవగాహన



రోగిని పరిక్షిస్తున్న కోరుకొండ వైద్యాధికారి జగదీష్

చింతపల్లి: మండలంలోని ఒడిశా సరిహద్దు ప్రాంతమైన దిగజనభ గ్రామంలో కోరుకొండ వైద్యాధికారి జగదీష్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి వడపోసిన నీటిని సేవించాలని, వెచ్చని ఆహారాలను తీసుకోవాలని, నిల్వ ఆహారం తీసుకొవద్దని, అనారోగ్యమైతే తక్షణమై సమీపంలోని వైద్య కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో 90 మందికి వైద్య పరీక్షలు చేశారు. మరో 15 మందికి రక్త పరిక్షలు చేసి మందులు అందజేశారు. వైద్యాధికారి సాయిష, సర్పంచ్ రమేష్‌నాయుడు, హెచ్‌వి అమ్మాజి, ఏఎన్‌ఎం సోములమ్మ, రమణ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రమదానంతో చెత్త తొలగింపు



కుమ్మరిపుట్టు మత్స్యగెడ్డ ఒడ్డున శ్రమదానంతో చెత్తను తొలగిస్తున్న యువత

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టు, కొత్తసుజనకోట గ్రామాల సమీపంలోని మత్స్యగెడ్డ ఒడ్డున సోమవారం యువత శ్రమదానం చేశారు. పర్యాటకులు గత కొన్ని నెలలుగా మత్స్యగెడ్డ ఒడ్డున పర్యటించడంతో పరిసరా ప్రాంతాల్లో పారిశుధ్యం లోపించి, కంపు కొడుతుంది. దీంతో ముంచంగిపుట్టుకు చెందిన అల్లూరి యూత్ యువత మత్స్యగెడ్డ ఒడ్డున పరిసరాల పరిశుభ్రతకు ముందుకు వచ్చారు. శ్రమదానంతో ప్లాస్టిక్ వ్యర్థాలు,చెత్త చెదారం తొలగించారు.సహజ పర్యావరణ వ్యవస్థలను పరిరక్షించడం వల్ల మత్స్యగెడ్డను శుభ్రపరచడం ముఖ్యమని, పర్యటకులు చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను చెత్త డబ్బాలలో వేయాలని పరిసరాల పరిశుభ్రతకు సహకారించాలని అల్లూరి యూత్ యువత ఉదయ్,కిరణ్, అనిల్,తరుణ్,నరేష్,సతీష్,చంటిలు కోరారు. మత్స్యగెడ్డ ఒడ్డున శ్రమదానంతో శుభ్రం చేసిన యువతకు పలువురు అభినందనలు తెలిపారు.